చెట్ల కిందే చదువులు



కల్యాణి ప్రాథమిక పాఠశాలలో చెట్ల కింద చదువుతున్న విద్యార్థులు



నిరుపయోగంగా మారిన టాయిలెట్లు

- సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు
- కల్యాణి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల గోస

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించక పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మండలంలోని కల్యాణి ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు సరిపడా లేక, టాయిలెట్లు నిరుపయోగంగా మారి, వరండాలో, చెట్ల కింద చదువులు చదువుకుంటూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 5 తరగతులు ఉండగా 73 మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి 5 తరగతి గదులు ఉండగా కేవలం రెండు గదులలోనే విద్యను అభ్యసిస్తున్నారు. ఇవి సైతం వర్షాకాలంలో కారడంతో పనికి రాని విధంగా తయారవుతున్నాయి. ఉన్న రెండు గదులలోనే మధ్యాహ్న భోజన బియ్యం నిల్వ ఉంచడానికి, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల గదిగా వీటినే వినియోగించుకుంటున్నారు. గతంలో శిథిలావస్థకు చేరిన తరగతి గదులను కూల్చి వేయడంతో వాటి స్థానంలో నూతనంగా గదులు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల టాయిలెట్లు నిరుపయోగంగా మారడంతో చిన్నారులు ఒకటికీ రెంటికీ బయటకు వెళ్తున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

గదులు సరిపోవడం లేదు



పాఠశాలలో తరగతి గదులు లేకపోవడంతో చెట్లకింద, వరండాలో కూర్చుని చదువుతున్నాం. వర్షాకాలంలో ఉన్న రెండు గదులు సైతం వర్షపు నీటితో కారుతుంటాయి. అప్పుడు కూర్చునేందుకు స్థలం కూడా ఉండదు.

– అబ్దుల్, విద్యార్థి, కల్యాణి పాఠశాల

అధికారులకు నివేదించాం



పాఠశాలకు అదనపు గదుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.గతంలో ఉన్న గదులు శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశాం. నీరు కారుతున్న గదుల మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు చేసినా పూర్తి కాలేదు.

–రవీందర్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, కల్యాణి

సంక్రాంతి ముగ్గుల పోటీలు



బీర్కూర్ ఉన్నత పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



రాజంపేట శిశుమందిర్‌లో ..

సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో చివరి రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంచి ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు.

– సాక్షి నెట్‌వర్క్



బీబీపేట బాలికల పాఠశాలలో ..



ఆర్కిడ్స్ పాఠశాలలో..



శ్రీవాణి పాఠశాలలో ..



లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో..



దోమకొండలో హరిదాసుతో..



శెట్పల్లిసంగారెడ్డి పాఠశాలలో..

రాజంపేట విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక

రాజంపేట: రాజంపేట విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంభాజీ నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా మంగోజీ లక్ష్మీనారాయణచారి, ప్రధాన కార్యదర్శిగా కుంభాజీ హనుమాన్లుచారి, కోశాధికారిగా సుమన్‌చారి, సలహాదారులుగా కమ్మరి శంకరాచారి, కమ్మరి శ్రీనివాసాచారి, కమ్మరి నాగరాజుచారీలు ఎన్నికయ్యారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా శశి కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, సహాయ కార్యదర్శిగా వినోద్ కుమార్, కోశాధికారిగా మహిపాల్, సలహాదారులుగా శంకరయ్య, మధుసూదన్, గంగాధర్, తదితరులు ఎన్నికయ్యారు.

బీమా సౌకర్యం కల్పించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని, 60 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. నాయకులు లక్ష్మణ్, బాబు, శ్యాం, సాయిబాబా తదితరులున్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



మద్నూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్

మద్నూర్(జుక్కల్): మండలంలోని రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ ముజీబ్ సూచించారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో గురువారం ఆయన మండల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సీఎం ఆదేశాల అనుసారం రేషన్ డీలర్లు తప్పకుండా ప్రతి లబ్ధిదారుడికి రేషన్ సరుకులు అందించాలన్నారు. డీలర్లు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని నిర్లక్ష్యం పనికిరాదన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!



తాడ్వాయి(ఎల్లారెడ్డి): సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మైనర్ డ్రైవింగ్, బాల్యవివాహాలు తదతర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలయ్యాయని, వారి ఆత్మగౌరవం దెబ్బతినకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువుపై దృష్టి సారించాలన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో గురువారం హిట్ అండ్ రన్ అనే చట్టాన్ని వ్యతిరేకిస్తూ డ్రైవర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడి ధర్నా రాస్తారోకో చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి, స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్ కార్యాలయాలలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లారీ యూనియన్ అధ్యక్షుడు షేక్ కరీం మాట్లాడుతూ..ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వెనక్కి తీసుకునేంత వరకు ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని చాటుతున్నారు

- జూనియర్ కళాశాల పిన్సిపాల్ యూసుఫ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ యూసుఫ్ హుస్సేన్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నాలుగు రోజులుగా చిట్యాలలో క్లీన్-గ్రీన్ అనే కార్యాక్రమాలు చేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారని కళాశాల ప్రిన్స్‌పల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్ అన్నారు. చిట్యాల రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కళాశాలకు చెందిన 50 మంది వాలంటీర్లు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు కాలనీలో తిరుగుతూ పలు సేవకార్యాక్రమాలు చేయడం గొప్పవిషయమన్నారు. అలాగే యోగ, పారిశుద్యం, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. సర్పంచ్ కవిత, ఎంపీటీసీ రాజమణి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవ అలవర్చుకోవాలి



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలామ్

లింగంపేట(ఎల్లారెడ్డి):విద్యార్థులు దేశభక్తితో పాటు సమాజ సేవను అలవర్చుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలామ్ అన్నారు. గురువారం ఆయన సురాయిపల్లి, మెంగారం గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాలను సందర్శించారు.ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ ఒక్కరూ పది మందికి ప్రయోజనం చేస్తూ మానవతా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. అలాగే సురాయిపల్లిలో ఏర్పాటు చేసిన యువజన క్రీడలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ నరేందర్, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాకం రాములు, కో-ఆర్డినేటర్లు రాజయ్య, ధర్‌సింగ్, అధ్యాపకులు నిజాం, ఫణి కుమార్, దుర్గయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎంపీ



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

కామారెడ్డి రూరల్: దేవునిపల్లిలోని మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకుడు సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవ జ్ఞాపిక, శాలువాతో ఎంపీ బీబీ పాటిల్‌ను వీడీసీ ప్రతినిధులు సన్మానించారు. మల్లన్న ఆలయం వద్ద నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు భోజన్నగారి రాజు పాటిల్, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్, కోశాధికారి గుడెల్లి గంగారాం, కౌన్సిలర్ ఉరుదొండ వనిత పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపేయండి



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలంటూ స్థానిక కాలనీవాసులు గురువారం ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులతో కలిసి కాలనీవాసులు రామారెడ్డి రోడ్డు మీద బైఠాయించి అరగంట పాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్ల వద్ద సెల్ టవర్ నిర్మాణం వల్ల రేడియేషన్ ప్రభావంతో చిన్నపిల్లలు, గర్భిణీలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని వాపోయారు. గతంలోనే మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఘటనా స్థలానికి పట్టణ సీఐ నరేష్ చేరుకొని కాలనీవాసులను సముదాయించారు.

సమాచారం..

14న భరత నాట్య ప్రదర్శన

భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయంలో ఈనెల 14న భరత నాట్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కావూరి కుటుంబీకుల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు 31 వరకు గడువు

కామారెడ్డి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాంలో ప్రవేశాలకు ఈనెల 31 వరకు అవకాశముందని కామారెడ్డి అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఈ.రాజ్‌కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన డిప్లొమా, ఐటీఐ, ఓపెన్ స్కూల్ అర్హతలున్నవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సమన్వయకర్త సూచించారు. ఓపెన్ డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థులు తమ ఫీజు చెల్లించి అడ్మిషన్ రెన్యూవల్ చేసుకోవాలని కోరారు.

మండల స్థాయి వాలీబాల్ పోటీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో మండల స్థాయి వాలీబాల్ క్రీడలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.6 వేలు, రెండవ బహుమతి రూ. 3 వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుము రూ. 300 చెల్లించాలన్నారు. 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే రంగోలీ పోటీలు ఈ నెల 15న ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వివరాలకు నరేష్-7780424999, రాకేష్-8501813103, అరవింద్-8688736135 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు రక్తదాన శిబిరం

దోమకొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మ్యాక నాగరాజు గురువారం తెలిపారు. దోమకొండ రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని ఆయన వివరించారు.

'భరోసా కేంద్రం'లో తాత్కాలిక పోస్టులకు దరఖాస్తులు

కామారెడ్డి అర్బన్: భరోసా కేంద్రంలో ఒప్పంద ప్రతిపాదికన పనిచేయడానికి లీగల్ సపోర్ట్ పర్సన్ కౌన్సెలర్, రిసెప్షనిస్టు, ఏఎన్ఎం ఒక్కో పోస్టు, సపోర్ట్ పర్సన్ రెండు పోస్టులకు 25 సంవ్సతరాలు నిండిన అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఈనెల 20 వరకు దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా ఎస్పీ సీహెచ్.సింధూశర్మ తెలిపారు. పూర్తి తాత్కాలిక పద్ధతిన ఏడాది కాలానికి నియమించే భరోసా కేంద్రం పోస్టులకు దరఖాస్తు చేసే వారు వివరాలకు డీసీఆర్‌బీ సీఐ శ్రీధర్‌రెడ్డి నంబర్ 8712686088 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తులను ఎస్పీ కార్యాలయం ఇన్‌వార్డు సెక్షన్‌లో అందజేయాలని సూచించారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ



బాన్సువాడ: నియోజకవర్గంలోని ఇరువురు దివ్యాంగులకు గురువారం బాన్సువాడలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. పోచారం భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సయ్యద్ షబ్బీర్, దేశాయిపేట్ గ్రామానికి చెందిన రాజులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత అవసరాల కోసం ప్రయాణం చేయాల్సి వస్తే దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని, అందుకు వారికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందజేశామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు రఘు, మోహన్‌నాయక్, వెంకట్‌రాంరెడ్డి, ఎజాస్, సందీప్, శ్రావణ్, కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఓబన్న జయంతి

భిక్కనూరు: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను రామేశ్వర్‌పల్లిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఓబన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్య సాధనకు ఓబన్న చేసిన పోరాటం ఆమోఘమని కొనియాడారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యరదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు తక్కళ్ల నర్సరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, వడ్డెర సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల ముగింపు

భిక్కనూరు: జంగంపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే 193వ జయంతి వేడుకల ముగింపు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాలలోని 14 మంది మహిళ ఉపాధ్యాయురాళ్లకు మెమెంటో, శాలువాలతో సత్కరించారు. విద్యార్థినులకు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ప్రిన్సిపాల్ మణిదీప్తి, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజుకుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు పాఠశాలల్లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో గురువారం రోజున వివేకానంద జయంతిని ఒకరోజు ముందుగా జరుపుకున్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

'డిజిటల్ తరగతుల్లో ఆదర్శంగా నిలువాలి'

కామారెడ్డి అర్బన్: అధ్యాపకులు తమ సబెక్ట్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అన్ని డిజిటల్ పాఠ్యాంశాలను రూపొందించుకోవాలని, ఈ-కంటెంట్ అభివృద్ధి ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం కళాశాల బోధనా సిబ్బందికి గణితశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త నిర్వహణలో డిజిటల్ పాఠ్యాంశాల రూపకల్పన, పవర్ పాయింట్ ద్వారా విద్యార్థులకు ప్రయోజనాత్మక బోధనపై శిక్షణ, వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాల్గొని మాట్లాడారు. గణితశాస్త్ర విభాగాధిపతి ఆర్.రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవదాన్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి జీవదాన్ పాఠశాలలో గురువారం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ఎంఈవో వెంకటేశం ప్రారంభించారు. పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో ఎంఈవో క్రీడాజ్యోతిని వెలిగించిన అనంతరం రన్నింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపల్ బాబు, వైస్ ప్రిన్సిపల్ జోబిష్ తదితరులున్నారు.

ఘనంగా ఏలమాస అమావాస్య



సాక్షి నెట్‌వర్క్‌:జిల్లాలో గురువారం ప్రజలు ఏలమాస పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు ఎడ్ల బండ్లపై పొలాలకు వెళ్లి ధాన్యలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని లక్ష్మీదేవిని వేడుకున్నారు. అనంతరం భోజనాల కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్తం

యాసంగి పంటల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): గండివేట్, సీతాయిపల్లి గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న పంటలను ఎల్లారెడ్డి ఏడీఏ రత్న పరిశీలించారు. మొక్కజొన్నలో కాండం తొలిచే, కత్తెర పురుగులు ఆశించినట్లు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

రెండు గ్రామాల్లో నర్సరీలు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాఘవపల్లి, ధర్మారెడ్డి గ్రామాలలో గల నర్సరీలను గురువారం స్థానిక ఎంపీడీవో రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో జర్మినేషన్ తీరును ఆయన పరిశీలించారు. కార్యదర్శి క్రిష్ణమూర్తి ఉన్నారు.

జంగమ అర్చక సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో గురువారం శ్రీ ఖండేరాయ ఆలయ ప్రాంగణంలో జిల్లా స్థాయి జంగమ అర్చక సమాజ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగమ సమాజ సంఘం జిల్లా కోశాధికారి జంగం ప్రసాద్ మాట్లాడుతూ...ప్రభుత్వం అర్చకుల సేవలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతినిధులు అవినాష్, జంగం రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ మండల అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రాజ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన విష్ణువర్ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా బి.రాజు, కోశాధికారిగా పి.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా సంజీవ్, శ్రీకాంత్, సలహాదారులుగా ఉమాశేఖర్, శ్రీధర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

పిట్లం(జుక్కల్): కుర్తి గ్రామంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ రాష్ట్ర కమీటి సభ్యులు సంజీవ్ రెడ్డి మాట్లాడారు. వైద్యాధికారులు రోహిత్ , హరికిషన్ ఉన్నారు.

కొత్తపల్లిలో ఫుడ్ ఫెస్టివల్

మాచారెడ్డి: కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రశాంతి మాట్లాడారు. తెలంగాణ వంటలతో పాటు పౌష్టికాహారం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజూ పౌష్టికాహారం తీసుకుంటే రోగాలు దరిచేరవని వివరించారు.

మిత్రుడి జ్ఞాపకార్థం యువకుల రక్తదానం

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి చెందిన మీసాల నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన జ్ఞాపకార్థం నవీన్ తండ్రి మీసాల భూమయ్యతో పాటు మిత్రబృందం పది మంది రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు అన్నారు. స్థానిక రక్తనిధి కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నవీన్ మిత్రబృందం రక్తదానం చేసింది. రక్తదాతల సమూహం ప్రతినిధులు జమీల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు టాలెంట్ సెర్చ్ పరీక్ష

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం గ్రామీణ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ సెకండియర్ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ విద్యార్థులకు టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహించారు. వీటిలో ఎంపికైన వారికి డిగ్రీ చదివే సమయంలో ప్రతి ఏడాది రూ.4 వేలు అందిస్తామని ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి వాసుదేవరెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి,విద్యార్థులు ఉన్నారు.